
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3, కనిష్ఠం 24.8



నిజామాబాద్
జిల్లా వార్తలు
5 మంగళవారం 22 అక్టోబరు 2024



వ్యాధుల పంజా

- జిల్లాను వణికిస్తున్న సీజనల్ వ్యాధులు
- పెరుగుతున్న డెంగీ, మలేరియా కేసులు
- ఆస్పత్రుల్లో కిక్కిరిసిపోతున్న రోగులు
- నిలువునా దోచేస్తున్న ప్రైవేటు వైద్యులు

నిజామాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. రెండు నెలలుగా సాధారణ జ్వరాలు, టైఫాయిడ్, డెంగీ, చికున్‌గున్యాలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల నుంచి మున్సిపాలిటీల వరకు వ్యాధుల తీవ్రత పెరగడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ప్రైవేటు ఆసుపత్రుల వరకు నిత్యం రోగులు వచ్చి చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధుల చికిత్స కోసం వేలాది రూపాయలను ఖర్చు చేస్తున్నారు. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో పరీక్షల పేరిట భారీగా వసూళ్లను చేస్తున్నారు. వ్యాధుల నిర్ధారణ పూర్తిస్థాయిలో చేయకముందే ఆసుపత్రుల్లో చేర్చుకుంటూ చికిత్స అందిస్తున్నారు. సాధారణ జ్వరాలు, టైఫాయిడ్ వచ్చిన వారు ఓపీలో చూపెట్టుకునేందుకు ప్రైవేటు ఆసుపత్రులకు వస్తే అన్ని పరీక్షలు చేసి ఆసుపత్రుల్లో చేర్చుకుంటున్నారు. డెంగీ పేరిట పెద్ద ఎత్తున వసూళ్లు చేస్తున్నారు. ప్లేట్‌లెస్ తగ్గాయని ఆసుపత్రుల్లో ఉంచుకుంటూ చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని డెంగీకి నిర్ధారణ యంత్రాలు ఉన్నా.. ప్రైవేటు ఆసుపత్రిలో యథేచ్ఛగా రాపిడ్ పరీక్షలు నిర్వహిస్తూ చికిత్స అందిస్తున్నారు.

ఆగస్టులో కురిసిన భారీ వర్షాలు

జిల్లాలో ఆగస్టులో భారీ వర్షాలు కురిసాయి. ఆ నెల నుంచే వ్యాధుల తీవ్రత పెరిగింది. వర్షాలకు దోమలు పెరగడంతో వ్యాధులు ఎక్కువగా వచ్చాయి. సాధారణ జ్వరాలతో పాటు టైఫాయిడ్, వైరల్ ఫీవర్, చికున్ గున్యా, డెంగీ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఈ వ్యాధుల తీవ్ర ఎక్కువగా ఉంది. వర్షాకాలం తగ్గుతూ చలికాలం మొదలవుతున్నా వ్యాధులు మాత్రం తగ్గడం లేదు. చాలా మంది సాధారణ జ్వరాలతో పాటు డెంగ్యూ, ఇతర వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల పరిధిలో ఫీవర్ సర్వేను నిర్వహించారు. గ్రామాల వారిగా శాంపిళ్లను సేకరించారు. జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కు పంపించారు.

జిల్లా వ్యాప్తంగా శాంపిళ్ల సేకరణ

జిల్లా వ్యాప్తంగా అధికారులు సుమారు 4లక్షల వరకు శాంపిళ్లను తీయగా దాదాపు 25వేల మందికి పైగా వ్యాధులు వచ్చినట్లు గుర్తించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో వ్యాధులకు సంబంధించిన చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేశారు. పీహెచ్‌సీల పరిధిలో సిబ్బంది తక్కువగా ఉండటం వైద్యులు అందుబాటులో ఎక్కువ సమయంలో ఉండకపోవడం వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వైద్యులు ఉన్న సమయంలో చూపెట్టుకుంటున్నా.. కీలకమైన కొన్ని మందుల సరఫరా తక్కువగా ఉండటం వల్ల ప్రైవేటు ఆసుపత్రుల్లోనే కొనుకునే పరిస్థితి ఉంది. జిల్లా జనరల్ ఆసుపత్రిలో కూడా ఎక్కువగా ఈ వ్యాధుల కేసులు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న రోగులతో పాటు కామారెడ్డి, నిర్మల్, నాందేడ్ జిల్లాకు చెందిన రోగులు వచ్చి చికిత్స పొందుతున్నారు. జిల్లా అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 600లకు పైగా డెంగీ కేసులు నమోదు అయ్యాయి. నిజామాబాద్ నగరం పరిధిలోని ఎక్కువగా ఈ కేసులు వచ్చాయి.

రెండు నెలలుగా పెరిగిన వ్యాధుల తీవ్రత

జిల్లాలో గడిచిన రెండు నెలలుగా వ్యాధుల తీవ్రత పెరగడంతో ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. సాధారణ జ్వరాలు వచ్చిన వారితో పాటు డెంగీ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ వచ్చినవారు నిత్యం ఈ ఆసుపత్రులకు వస్తూ చికిత్స పొందుతున్నారు. జ్వర తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి డెంగీ ఇతర వ్యాధుల పేరు చెప్పి ఆసుపత్రుల్లో చేర్పించుకుంటున్నారు. పెద్ద మొత్తంలో డబ్బులను వసూలు చేస్తున్నారు. రోజుల తరబడి ఆసుపత్రుల్లో ఉంటూ చికిత్స అందిస్తున్నారు. డెంగీ నిర్ధారించాలంటే ఎలిసా పరీక్షలు నిర్వహించాలి. దీనిలోనే పూర్తిస్థాయిలో డెంగీ వచ్చిందో రాదో తెలుస్తుంది. ఈ పరీక్షలు కేవలం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లోనే చేసే అవకాశం ఉంది. మిగతా ఆసుపత్రుల్లో అవసరమైన పరికరాలు లేవు. అన్ని ఆసుపత్రుల్లో రాపిడ్ కిట్స్ ద్వారా డెంగీ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈకిట్స్ ద్వారా కేవలం 50 శాతం లోపే నిర్ధారణ అవుతుంది. దీనిని ఆధారంగానే రోగులను చేర్చుకుంటున్నారు. రక్తపరీక్షలు, ప్లేట్‌లెట్స్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం వచ్చిన వారికి ఈ పరీక్షల పేరుమీద కనీసం మూడు నుంచి ఐదువేల వరకు వసూలు చేస్తున్నారు. పరీక్షలు పూర్తయిన తర్వాత ఆసుపత్రుల్లో ఉన్న రోజులకు అనుగుణంగా బిల్లులు వసూలు చేస్తున్నారు.

జిల్లాలో 350 వరకు ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు

జిల్లాలో 350 వరకు ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు ఉన్నాయి. వీటి పరిధిలోనే ఈ చికిత్స అందిస్తున్నారు. వీటిలో కొన్ని ఆసుపత్రులకు గుర్తింపు లేవు, మరికొన్ని ఆసుపత్రులకు తాత్కాలిక గుర్తింపులో ఉన్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో సంబంధిత వ్యాధులను చూసే వైద్యులు కూడా లేకున్నా ఇతర విభాగాల వైద్యుల ఆధ్వర్యంలో చికిత్స అందిస్తున్నారు. జిల్లాలోని ల్యాబుల్లో ఇష్టం వచ్చిన రీతిలో పరీక్షలను నిర్వహిస్తున్నారు. కొన్ని ల్యాబ్‌లలో పూర్తిస్థాయిలో టెక్నీషియన్‌లు లేకున్నా పరీక్షలను కొనసాగిస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల వారు గ్రామాల్లో తమ ఏజెంట్ల ద్వారా రోగులు వచ్చే విధంగా చూసుకుంటున్నారు. వారికి కమీషన్ రూపంలో డబ్బులను అందజేస్తున్నారు. ప్రతీ ఆసుపత్రిలో సేవలకు సంబంధించిన ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాల్సి ఉన్నా చాలా వరకు లేవు. వైద్యుల పేర్లతో పాటు ఫీజుల వివరాలు ఆసుపత్రి రిసెప్షన్ కౌంటర్ వద్దే పెట్టాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. రెండు నెలలుగా ఫీజులు ఎక్కువగా వసూలు చేస్తున్నా.. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం తనిఖీలు చేయడం లేదు. గతంలో పలు ఆసుపత్రులపై ఆరోపణలు వచ్చినా పట్టించుకోవడం లేదు. కొన్ని నెలల క్రితం ప్రైవేటు ఆసుపత్రుల సేవలపై తనిఖీలు నిర్వహించి కలెక్టర్‌కు నివేదిక అందించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



ఇంటర్వ్యూ

రీజియన్ అభివృద్ధికి చర్యలు

- ఆర్టీసీ ఆర్ఎం జానిరెడ్డి



సుభాష్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రీజియన్ పరిధిలో ఆర్టీసీ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఆర్ఎం జానిరెడ్డి తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: రీజియన్‌ను అభివృద్ధిలోకి తేవడానికి ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఆర్ఎం: డిమాండ్ ఉన్న రూట్‌లలో బస్సులను ఎక్కువగా తిప్పుతున్నాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా బస్సులను వేస్తున్నాం. సెఫ్టీని పాటిస్తూ ప్రయాణాలు సాగేలా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రతీ రోజు రీజియన్ పరిధిలో ఎన్ని కిలోమీటర్లు బస్సులను తిప్పుతున్నారు?

ఆర్ఎం: సుమారు 2లక్షల 25వేల కిలోమీటర్లు తిప్పుతున్నాం.

ఆంధ్రజ్యోతి: రీజియన్ పరిధిలో మొత్తం అద్దె బస్సులు, ఆర్టీసీ బస్సులు ఎన్ని?

ఆర్ఎం: నిజామాబాద్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ బస్సులు 390 కాగా, సుమారు 160 అద్దె బస్సులు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: రీజియన్ పరిధిలో రోజు ఎంత మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు?

ఆర్ఎం: సుమారు 2లక్షల 60వేల మంది ప్రయాణిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు ఎంతమంది ప్రయాణికులు ప్రయాణించారు?

ఆర్ఎం: డిసెంబరు 15 నుంచి సెప్టెంబరు వరకు సుమారు 4కోట్ల 90లక్షల మంది ప్రయాణించారు.

ఆంధ్రజ్యోతి: మహాలక్ష్మి పథకం ద్వారా రోజుకు ఎంత ఆదాయం వస్తుంది?

ఆర్ఎం: సుమారు రూ.50 నుంచి రూ.55లక్షలు ఆదాయం వస్తుంది.

ఆంధ్రజ్యోతి: ఆర్టీసీలో డ్రైవర కొరతను ఎలా అధిగమిస్తున్నారు?

ఆర్ఎం: రీజియన్ పరిధిలోని ఒక్కో డిపోలో సుమారు 10 సంఖ్యలో డ్రైవర్ల కొరత ఉంది. డ్రైవర్లకు డబుల్ డ్యూటీ వేసి డ్రైవర్ల కొరతను అధిగమిస్తున్నాం. డ్రైవర్లు అనారోగ్యం పడకుండా సంస్థ గ్రాండ్ హెల్త్ ప్రోగ్రాంను ఏర్పాటు చేస్తోంది.

ఆంధ్రజ్యోతి: నగరంలో నూతన బస్టాండ్ నిర్మాణం ప్రక్రియ ఎక్కడి వరకు వచ్చింది?

ఆర్ఎం: ప్రస్తుతానికి పెండింగ్‌లో ఉంది. స్థలం కోసం వెతుకుతున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో కొన్ని బస్టాండ్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ఎలా ఉపయోగంలోకి తెస్తున్నారు?

ఆర్ఎం: జిల్లాలో ప్రస్తుతం బస్టాండ్‌లన్నీ ఉపయోగంలోకి తెస్తున్నాం. బస్టాండ్‌లను ఆధునీకరించాం. డిచ్‌పల్లి, మాక్లూర్, మద్నూర్ లాంటి బస్టాండ్‌లను ఆధునీకరించి వాటిని ఉపయోగంలోకి తెచ్చాం.

ఆంధ్రజ్యోతి: రీజియన్ పరిధిలో రోజుకు ఎంత ఆదాయం వస్తుంది?

ఆర్ఎం: సుమారు కోటి 15లక్షల ఆదాయం ఒక్కరోజుకు వస్తుంది.

ఆంధ్రజ్యోతి: జిల్లాకు కొత్త ఎలక్ట్రిక్ బస్సులు కేవలం 12 వచ్చాయి మిగతావి ఎప్పుడు వస్తున్నాయి?

ఆర్ఎం: ఇప్పటికే రీజియన్ పరిధిలో పర్యావరణ రహిత ఎలక్ట్రిక్ బస్సులు 12 వచ్చాయి. వీటిని జేబీఎస్‌కు తిప్పుతున్నాం. మిగతా 52 బస్సులు త్వరలో వస్తాయి. వీటిని వరంగల్, నిర్మల్, తదితర రూట్‌లలో తిప్పుతాం.

ఆంధ్రజ్యోతి: ప్రయాణికుల రద్దీని ఎలా అధిగమిస్తున్నారు?

ఆర్ఎం: మహాలక్ష్మి పథకం అనంతరం ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీనిని అధిగమించేందుకు సెమీ డీలక్స్ డీలక్స్ బస్సులను ఏర్పాటు చేశాం. మిగతా రూట్‌లలో నాన్‌స్టాప్‌లను ఎక్కువగా తిప్పుతున్నాం.

జాప్యానికి తావులేకుండా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ మంజూరు

- పేద కుటుంబాలకు బాసటగా నిలవాలనే ఆడపిల్ల పెళ్లికి ఆర్థిక సాయం
- రాజీవ్‌గాంధీ ఆడిటోరియం ఆధునికీకరణకు రూ.50లక్షలు మంజూరు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

8



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ తదితరులు

కోర్టులలో మౌలిక సదుపాయాలు తప్పనిసరి

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు సురేందర్, లక్ష్మినారాయణ అలిశెట్టి, వినోద్ కుమార్

8

'పట్టభద్రుల ఎమ్మెల్సీని కైవసం చేసుకోవాలి'




న్యాయాధికారుల గృహ వసతి నిర్మాణాలకు శంకుస్థాపన నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

పరిశోధన, బోధన రంగాలను మరింత

బలోపేతం చేయడమే లక్ష్యం

- త్వరలో న్యాక్ గుర్తింపుకు వెళ్తాం
- టీయూ నూతన వీసీ యాదగిరి రావు



బాధ్యతలు స్వీకరిస్తున్న టీయూ నూతన వీసీ

డిచ్‌పల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీని పరిశోధన, బోధన రంగాల్లో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని నూతన వైస్ చాన్స్‌లర్ ప్రొ.యాదగిరి రావు అన్నారు. సోమవారం పరిపాలన భవనంలో వీసీగా బాధ్యతలు స్వీరించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నిర్మల్, ఆదిలాబాద్, జిల్లాల పరిధిలోని కళాశాలలను టీయూ పరిధిలోకి మార్చేల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. విద్యార్థులకు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు ప్రవేశపెడతామన్నారు. టీయూకి న్యాక్ గుర్తింపు కోసం త్వరలోనే ప్రక్రియ ప్రారంభిస్తామని అందుకు కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. వర్సిటీలో ప్రభుత్వ ఇంజనీరింగ్, ఫార్మా కళాశాలల ఏర్పాటుకు ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తానని తెలిపారు. త్వరలో స్నాతకోత్సం నిర్వహిస్తామన్నారు. బాలికల హాస్టల్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటమన్నారు. వర్సిటీలోని అన్యాక్రాంత భూములపై కలెక్టర్‌ను సంప్రదిస్తామని వీసీ తెలిపారు.

రుణం చెల్లించని

విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్

- షూరిటీదారులకు ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ నోటీసులు
- రూ.45 కోట్లు చెల్లించకుంటే భూములను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ నిర్వాహకులు తీసుకున్న రుణాన్ని చెల్లించకపోడంతో.. వారి షూరిటీదారులకు ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ సోమవారం నోటీసులు జారీ చేసింది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో జీవన్ మాల్ నిర్మించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ నుంచి విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ నిర్వాహకులు రుణం తీసుకున్నారు. ఇప్పటి వరకు బకాయి ఉన్న రూ.45కోట్ల 46లక్షల 90వేలను వడ్డీతో సహా చెల్లించాలని షూరిటీ ఇచ్చిన కాట్‌పల్లి గంగారెడ్డి, యాల్ల నరేందర్, నక్కల లక్ష్మణ్‌లకు నోటీసులు జారీ చేశారు. సకాలంలో డబ్బులు చెల్లించకుంటే వారికి చెందిన భూములను స్వాధీనం చేసుకుంటామని కార్పొరేషన్ అధికారులు నోటీసులో హెచ్చరించారు. వారు తాకట్టు పెట్టిన భూముల వద్ద ఫ్లకార్డులు పెట్టి నోటీసులు అతికించడం ఆర్మూర్‌లో చర్చనీయాంశంగా మారింది.



మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, వేదికపై మంత్రి జూపల్లి, మండవ, భూపతిరెడ్డి, షబ్బీర్ అలీ, ఈరవత్రి అనిల్ తదితరులు

సుద్దులంలో రూ.124 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కళాశాల

- జిల్లా అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్
- నుడా చైర్మన్‌గా కేశవేణు బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ కళాశాలను జిల్లాలో డిచ్‌పల్లి మండలం సుద్దులంలో ఏర్పాటు చేయనుందని దీనికి రూ.124 కోట్లతో త్వరలో జీవో వస్తుందని జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. 'నుడా' చైర్మన్‌గా కేశవేణు బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కి, మాజీ మంత్రి మండవ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు జిల్లా నాయకులమంతా ఏకతాటిపై ఉన్నామన్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ కళాశాల జాబితాలో మొదటి విడతలో జిల్లాకు చోటు దక్కలేదని సుద్దులంలో ఏర్పాటు చేసేందుకు సీఎంతో మాట్లాడానని అన్నారు. జిల్లాలో మరో మెడికల్ కళాశాల ఏర్పాటు అవసరం ఉందన్నారు. డిచ్‌పల్లి సీఎస్ఐ సంస్థ మెడికల్ కళాశాలను పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పార్టీలో కష్టపడిన వారికి పదవులు వస్తాయని చెప్పడానికి కేశవేణు నిదర్శనమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీలో కష్టపడిన వారికే టికెట్లు ఇస్తామన్నారు. ప్రతి ఏడాది లక్ష ఉద్యోగాలు ఇస్తామని తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేవలం 70వేల ఉద్యోగాలు ఇచ్చారని కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో 60వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. తొమ్మిదేళ్ల పాటు గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేని బీఆర్ఎస్ నాయకులు 13ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలు నిర్వహిస్తుంటే ఓర్వలేక రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు అని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలు ఏమిటో చెప్పాలని, సిగ్గులేకుండా కేంద్ర మంత్రులు రోడ్డెక్కుతారా అని ప్రశ్నించారు. బీసీ బిడ్డగా తాను ఉన్నానని రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం జరుగుతుంటే ఎలా చూస్తూ ఊరుకుంటామన్నారు. గ్రూప్-1 విషయంలో ఎలాంటి అపోహలు అవసరం లేదని రిజర్వేషన్లతో సంబంధం లేకుండా మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగాలు వస్తాయన్నారు.

విపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలి : జూపల్లి కృష్ణారావు

రాష్ట్ర ప్రభుత్వంపై కొన్ని మీడియా సంస్థల ద్వారా, సోషల్ మీడియాలో విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రూప్-1 పరీక్షల విషయంలో బీఆర్ఎస్ నాయకులు విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందన్నారు. జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేస్తానని, 20, 21 ప్యాకేజీ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఇన్‌చార్జి మంత్రి జూపల్లి అన్నారు.

కాంగ్రెస్ చేసిన అభివృద్ధే : షబ్బీర్‌అలీ

జిల్లాలో 2004 నుంచి 2014 వరకు జరిగిన అభివృద్ధే తప్ప గత పదేళ్లలో జరిగింది శూన్యమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో తెలంగాణ యూనివర్సిటీ, మెడికల్ కళాశాల, గుత్ప అలీసాగర్, తదితర ప్రాజెక్టులు తీసుకువచ్చిందన్నారు. కేశవేణు నిబద్ధత గల నాయకుడని ఆయన భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని షబ్బీర్ అలీ అన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కేశవేణు..

నుడా చైర్మన్‌గా కేశవేణు సోమవారం పాత మున్సిపల్ కార్యాలయంలోని నుడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కేశవేణు పార్టీ పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు రాజేశ్వర్, ఆకుల లలిత, కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్‌బిన్ హందాన్, ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

దేశ రక్షణలో పోలీసుల కృషి మరువలేనిది

నిజామాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశరక్షణలో పోలీసు దళాలు చేస్తున్న కృషి మరువలేనిదని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. నిజామాబాద్ పోలీస్ హెడ్‌క్వాటర్‌లో సోమవారం జరిగిన అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలతో ఆయన మాట్లాడారు. దేశరక్షణ కోసం బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్‌తో పాటు ఇతర పారామిలటరీ పోలీసులతో పాటు పోలీసు దళాలు ఎంతో కృషి చేస్తున్నాయని అన్నారు. సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు వారు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్నారని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడం గౌరవించడం మన కర్తవ్యం అని ఆయన అన్నారు. లడక్‌లోని అక్షయ్‌చిన్ వద్ద అక్టోబరు 21, 1959లో పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది చైనా ఎదురు దాడిలో ప్రాణాలు కోల్పోయారని అదనపు పోలీస్ కమిషనర్ బి.కోటేశ్వర్ రావు అన్నారు. వారి త్యాగాల స్ఫూర్తిగా ప్రతీ సంవత్సరం అక్టోబరు 21న పోలీసుల సంస్మరణ దినం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 214 మంది పోలీస్ సిబ్బంది ప్రాణాలను కోల్పోయారని అన్నారు. జిల్లాలో 1986 నుంచి ఇప్పటి వరకు 19 మంది పోలీసులు అమరులయ్యారని ఆయన అన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి, వివిధ శాఖలకు చెందిన ఏసీపీలు శ్రీనివాస్‌రావు, రవీందర్‌రెడ్డి, నాగేంద్రచారి, నాగయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ శ్రీశైలంతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.




నివాళులర్పిస్తున్న పోలీసు అమరుల బంధువులు

నిండుకుండలా నిజాంసాగర్

● సాగర్‌లోకి [illegible] పాలు..
● అమాయకుల [illegible] విక్రయం

నిజాంసాగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏడాది నిజాంసాగర్ ప్రాజెక్టు లోకి దాదాపు 51.588 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. 36 రోజుల పాటు నిజాంసాగర్ వరద గేట్లు ఎత్తి 33.70 టీఎంసీల నీటిని మంజీరా లోనికి వదిలివేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో 17 టీఎంసీల పూర్తి నీటి సామర్థ్యాన్ని నీటిపారుదల శాఖ అధికారులు నిల్వచేస్తూ ఎగువ నుంచి వచ్చే నీటిని నేరుగా వరద గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తూనే ఉన్నారు. సెప్టెంబరు 4వ తేది నుంచి మొదలుకుని 21 అక్టోబరు వరకు గేట్లను కొనసాగిస్తూ ఎగువ నుంచి వచ్చే నీటిని గేట్ల ద్వారా వదిలివేయడం విశేషం. మొదట్లో నిజాం సాగర్ ప్రాజెక్టు 29 టీఎంసీల సామర్థ్యం గల ప్రాజెక్టు కాగా కాలక్రమేనా నిజాంసాగర్ ప్రాజెక్టులో ఇసుక మెట్ట వచ్చిచేరడంతో ప్రాజె క్టు నీటి సామర్థ్యం 17 టీఎంసీలకే ప్రాజెక్టులో 13 టీఎంసీల ఇసుక మెట్ట వచ్చి చేరింది. 1976 సంవత్సరం ప్రాజెక్టు నీటి సామర్థ్యాన్ని పెంచేందుకు పురాతన అలుగుల వద్ద 20 గేట్లను నిర్మించిన ప్రాజెక్టు తరిగిపోయిన నీటి సామర్థ్యం గాను 1.5 టీఎంసీల నీటిని పెంచగలిగిన ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం రాలేకపోవడం గమనార్హం. లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే నిజాం సాగర్ ప్రాజెక్టు కేవలం 1,35,000 ఎకరాలకు సాగునీరందించేందుకు పరిమితమైంది. ప్రాజెక్టు నిర్మాణ దశలో రెండు లక్షల 75 వేల హెక్టార్లకు కాగా నిజాంసాగర్ ప్రాజెక్టు లక్ష 35,000 ఎకరాలకి పరిమితమైంది. గుప్త ఎత్తిపోతల పథకంతో పాటు రాజారాం ఎత్తిపోతల పథకాన్ని నిర్మాణం చేపట్టి లక్ష ఎకరాలకు నీరు అందిస్తుంది. నిజాంసాగర్ ప్రాజెక్టులో ఇసుక మేట పెరిగిన కారణంగానే నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి నిలువలు తగ్గిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే భారీ వరద నీరు నిజాంసాగర్‌లోనికి వచ్చిన ప్రాజెక్టుకి సామర్థ్యం తరిగిపోవడంతోనే ప్రాజెక్టు నుంచి ప్రతియేటా లక్షల టీఎంసీల నీరు మంజీరా లోనికి వదిలివేస్తున్నారని సీనియర్ రిటైర్డ్ ఇరిగేషన్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ఉభయ జిల్లాలకు సాగునీరు అందిస్తున్నప్పటికీ నిజాంసాగర్ 17 టీఎంసీలకు పరిమితమైంది. ప్రభుత్వాలు పాలకులు మారుతున్నా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే నిజాం సాగర్ ప్రాజెక్టుపై నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తు న్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు తెలంగాణలోని మొట్ట మొదటిప్రాజెక్టు అయినప్పటికీ ప్రభుత్వాలు ప్రాజెక్టును పట్టించుకునే పాపాన పోలేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా నిజాంసాగర్ పూర్తి నీటి సా మర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.


ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి


ఆలూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని ఆలూర్ సొసైటీ చైర్మన్ తంబూరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆలూర్, దేగాం, మచ్చర్ల గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, కల్లెం సాయిరెడ్డి, గోవర్ధన్, కల్లెం బోజారెడ్డి, మల్లూబాయి, ప్రమోద్‌కుమార్, రాజేశ్వర్, గంగాధర్, నర్సారెడ్డి, కట్ట నర్సయ్య, లసుంబాయి, మాజీసర్పంచ్ కల్లెం మోహన్, మాజీఎంపీటీసీ మర్కంటి మల్లేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, లోక ముత్యంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గడ్డం నర్సారెడ్డి, సీఈవో మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మునిపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో...

జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లి సింగిల్‌విండో పరిధిలోని మునిపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం మాజీ డీసీఎంఎస్ చైర్మన్, మునిపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఎం.సాయిరెడ్డి ప్రారంభిం చారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సన్న రకం, దొడ్డు రకం ధాన్యంకు మద్దతు ధర ప్రకటించి ధాన్యం కొనుగోలు చేస్తుం దని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. సన్నరకం ధాన్యం క్వింటాలుకు రూ.2300, బోనస్ రూ.500, దొడ్డు రకం ధాన్యం క్వింటా లుకు రూ.2320 మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విండో సీఈవో ఆర్.మల్లయ్య, డైరెక్టర్‌లు, వీడీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం పచ్చలనడ్కుడలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ గడ్డం లింబారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లింబారెడ్డి మాట్లాడుతూ ఏ గ్రేడ్ (దొడ్డురకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2320, బి గ్రేడ్ (సన్నరకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2300 మద్దతు ధర ఉందన్నారు. తమ సంఘ పరిధిలోని గ్రామాల రైతులు తమ ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ప్రతీ రైతు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రెటరీయ. స్వామి, ఎఎంసీ మాజీ వైస్‌చైర్మన్ నల్ల రమేష్, మాజీసర్పంచ్ గంగారెడ్డి, డైరెక్టర్‌లు గట్టవుతాల నర్సారెడ్డి, తలారి శేఖర్, అంకం నాగమల్లేష్, కొత్తపల్లి రామన్న, టక్కరి గంగాధర్, వీడీసీసభ్యులు, కోళ్ల సంఘం పెద్ద మనుషులు, సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖుద్వాన్‌పూర్‌లో..

నందిపేట: మండలంలోని ఖుద్వాన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని గ్రామాల్లో నాలుగు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం సొసైటీ చైర్మెన్ వాకిడి కార్తీక్ రెడ్డి ప్రారంభించారు. శాపూర్, తొండాకూర్, దత్తాపూర్, ఖుద్వాన్‌పూర్ గ్రామాల్లో ఒక్కటి చొప్పున కేంద్రాలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా చైర్మెన్ వాకిడి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ ఏ గ్రేడు(దొడ్డు రకం) వరి ధాన్యం క్వింటాలుకు రూ.2,320, బి గ్రేడు(సన్న రకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2,300 ధర ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సుదర్శన్ కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో ఐల చిన్నయ్య, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, సొసైటీ డైరెక్టర్లు, రైతులు వివిధ పార్టీల నాయకులు ఉన్నారు


పచ్చలనడ్కుడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ లింబారెడ్డి


ఖుద్వాన్‌పూర్‌లో సొసైటీ వాకిడి కార్తీక్ రెడ్డి

కోనసముందర్‌లో భారీ వర్షం

● కొనుగోలు కేంద్రంలో తడిసిముద్దైన వరి ధాన్యం


కోనసముందర్‌లో వర్షానికి తడిసి ముద్దైన వరి ధాన్యం రాశులు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండలంలో కోనసముందర్, నర్సాపూర్, ఇనాయత్ నగర్ తదితర పరిసర గ్రామాలలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై ఆరబోసిన వరిధాన్యం కుప్పలు తడిసిపోగా కోనసముందర్ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రానికి తరలించి కుప్పలుగా పోసిన వరిధాన్య తడిసి ముద్దవ్వగా కొన్ని కుప్పల నుంచి వరిధాన్యం వర్షానికి కొట్టుకు పోయాయి. కాగా ప్రతీ ఏడాది వరి కొనుగోలు కేంద్రాలను సమయానికి కొనుగోల్లు ప్రారంభించే ప్రక్రియ ఈసారి ఆలస్యం కావడంతో ఆరుగాళం కష్టపడి పండించిన వరి పంట వర్షతర్పాణం అయిందని రైతులు వాపోతున్నారు. ఇదిలాఉండగా కొనుగోలు కేంద్రం ప్రారంభించిన కొద్ది గంటల్లోనే భారీ వర్షం కురవడం గత వారం రోజులుగా తూకం కోసం కొనుగోలు కేంద్రానికి తరలించిన ధాన్యం కుప్పలు తడిసి ముద్దవ్వడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలో సోమవారం మధ్యాహ్నం అకాల భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్డు పక్కన అలాగే కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దయ్యింది. అలాగే వరి పంట నేలకొరిగింది. అకాల వర్షం కురువడంతో పంట తడిసి ముద్దయ్యిందని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరారు.

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్ల పక్కన ఆరబోసిన ధాన్యంతో పాటు కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. మండలంలోని అనంతగిరి, ధర్మారం, అబ్బాపూర్(ఎం), మోకన్‌పల్లి తదితర గ్రామాలలో భారీ వర్షం కురియడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని చోట్ల భారీ వర్షానికి రోడ్లపైన ఆరబోసిన ధాన్యం వర్షం నీటికి కొట్టుకుపోయింది. వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

● పొతంగల్‌లో బీజేపీ నాయకుల రాస్తారోకో


పొతంగల్‌లో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

కోటగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలు నామ మాత్రంగా ఏర్పాటు చేసి రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని బీజేపీ నాయకులు విమర్శించారు. పొతంగల్ మండల కేంద్రంలో సోమవారం బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుందని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తెచ్చిన సహకార సంఘాలు కొనుగోలు చేయడం లేదన్నారు. గత వారం రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ఇప్పటి వరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలును వేగవంతం చేయడంతో పాటు బోనస్ ధరను ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భజరంగ్, శంకర్, అశోక్, ముత్తన్న, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ రాస్తారోకో

నవీపేట, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు చేపట్టి 15రోజులు గడుస్తున్న ఇప్పటికి రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం పట్ల నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, వంశీ మోహన్, శ్రీనివాస్ గౌడ్, కోరే గంగాధర్, ఆనంద్, రాజేందర్ గౌడ్, భూషణ్, రాము, రాజశేఖర్, భాను గౌడ్, ప్రవీణ్, రాధ, తదితరులున్నారు.

రెంజల్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులు నిలువున దోచుకుంటున్నారని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతుల వద్ద దళారులు అందిన కాడిని దోచుకుంటున్నారని నిరసిస్తూ మండలంలోని దూపల్లి సొసైటీ ముందు ధర్నా నిర్వహించారు.

న్యాయమూర్తుల గృహ సముదాయాలకు శంకుస్థాపన

● పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు సురేందర్, లక్ష్మీనారాయణ


భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): బోధన్‌లో సోమవారం వర్చువల్‌గా న్యాయమూర్తుల నూతన గృహ నిర్మాణ పనులు ప్రారంభించారు. హైకోర్టు న్యాయమూర్తులు కే.సురేందర్, లక్ష్మీనారాయణ అలిశెట్టి వర్చువల్‌గా నిర్మాణ పునాది పనులను ప్రారంభించారు. రాకాసిపేట్‌లోని సబ్ కలెక్టర్ కార్యాలయం పక్కన గల స్థలంలో న్యాయమూర్తుల క్వార్టర్స్ నిర్మాణానికి సామూహికంగా పూజారులు, ఇమామ్, పాస్టర్లచే ప్రత్యేక ప్రార్థనల అనంతరం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా 5వ జిల్లా అదనపు జిల్లా న్యాయమూర్తి రవి కుమార్ మాట్లాడుతూ బోధన్ న్యాయమూర్తుల సౌకర్యార్థం నాలుగు క్వార్టర్ల నిర్మాణానికి 5.4కోట్ల రూపాయలు మంజూరయ్యాయన్నారు. నలుగురు న్యాయమూర్తుల నివాసయోగ్యానికి గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఫస్ట్‌ఫ్లోర్ నిర్మిస్తున్నట్లు వివరించారు. పనులను నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ చొరవ తీసుకుని పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్, ఇన్‌చార్జి న్యాయమూర్తి హరి కుమార్, న్యాయమూర్తి శేషతల్ప సాయి, ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట్ నారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోశెట్టి, ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్ రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు, ప్రభుత్వ న్యాయవాదులు గౌసోద్దీన్, బొగ్గుల రవీందర్, ఎస్ఎస్ఆర్ కోటేశ్వర్‌రావు, న్యాయవాదులు నర్సింహ రెడ్డి, గోపాల్ రెడ్డి, సంగం, హన్మంత్ రావు, గంగారెడ్డి, ఈశ్వర్, అడ్లూరి శ్రీనివాస్, బానోత్ రమేష్, పోలీసు సిబ్బంది, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

నవీపేట,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నాగేపూర్‌కు చెందిన కే.మహిపాల్ రెడ్డిని సోమవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. మహిపాల్ రెడ్డి తల్లి గంగవ్వ(85) ఈ నెల 17న అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అంతిరెడ్డి రాజిరెడ్డి, గడుగు గంగాధర్, సునీల్ రెడ్డి, మండల నాయకులు శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, సంజీవ రెడి ఉన్నారు.

కందకుర్తి గోదావరిలో వ్యక్తి గల్లంతు

రెంజల్,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): బోధన్ గ్రామానికి చెందిన మాధవ్ సోమవారం భార్య, పిల్లలతో కందకుర్తి గోదావరికి వచ్చి గోదావరి రెండవ ఘాట్ వద్ద స్నానం చేయడానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య శారద చుట్టు పక్కల అంతట వెతికిన భర్త ఆచూకి తెలియకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు.

తండ్రిని చంపిన తనయుడు

● తండ్రిని టవాల్‌తో గొంతు నులిమి సహజ మరణంగా చిత్రీకరణ
● అనంతగిరిలో దారుణం


హత్యకు గురైన గౌరు అమృతం

నవీపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరిలో సోమవారం తెల్లవారుజామున దారుణం జరిగింది. తండ్రిని తనయుడు టవాల్‌తో గొంతు నులిమి చంపి సహజ మరణంగా చిత్రీకరించాడు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్ కుమార్, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గౌరు అమృతం(54)స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. 20సంవత్సరాల క్రితం అమృతం తన భార్య లక్ష్మీతో గొడవ పడడంతో ఆమె తన ఇద్దరు కుమారులైన మహిపాల్, మనోజ్‌లతో కలిసి మాక్లూర్ మండలం గొట్టుముక్కలలో ఉంటుంది. తరుచుగా మద్యం సేవించే అమృతం పంచాయతీ కార్మికుడిగా పని చేస్తూ గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్నాడు. మృతుడికి గ్రామంలో ఒక ఇల్లు, ఒక ఖాళీ ప్లాటు ఉన్నాయి. రెండు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన పెద్ద కుమారుడు మహిపాల్ వారం రోజుల క్రితం స్వదేశానికి వచ్చాడు. గత వారం రోజులుగా అతడు అనంతగిరిలో తండ్రి వద్దే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి తండ్రికి అతిగా మద్యం తాగించాడు. సోమవారం తెల్లవారుజామున పథకం ప్రకారం తండ్రిని టవాల్‌తో గొంతు నులిమి హత్య చేశాడు. ఉదయం పూట తన తండ్రి ఆకస్మాత్తుగా మృతి చెందాడని గ్రామస్థులకు వివరించడంతో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. అంత్యక్రియల సమయంలో మృతదేహనికి స్నానం చేయించే సమయంలో అతని గొంతుపైన గాట్లు కనిపించాయి. దీంతో అనుమానం వ్యక్తం చేసిన స్థానికులు మహిపాల్‌ను విచారించగా పొంతనలేని సమాధానాలు ఇచ్చాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ వినయ్ మృతదేహన్ని పోస్టుమార్టం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించి కుమారుడు మహిపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తండ్రిని తానే హత్య చేశానని అంగీకరించాడు. 20సంవత్సరాల క్రితం తన తల్లి లక్ష్మితో పాటు చిన్న వయసులో ఉన్న పిల్లలమైన తమను అకారణంగా వెళ్లగొట్టాడని, తన తండ్రి తరుచుగా మద్యం తాగడంతో తనకు పెళ్లి సంబంధాలు రావడం లేదని, తన తండ్రి పేరున ఉన్న ఇల్లు, ప్లాట్‌ను విక్రయించాలన్న ఉద్దేశంతో నిందితుడు మహిపాల్ ఈ దారుణానికి ఒడిగట్టాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

వర్ని, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో సోమవారం మడివాడ్ సంజీవ్ కుమార్(43) మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం ఔరాద్ మండలం చిక్లి గ్రామానికి చెందిన మృతుడు సంజీవ్ కుమార్ ఊరూరా తిరుగుతూ టైలరింగ్ ద్వారా ఉపాధి పొందే వాడని తెలిపారు. ఈ నేపథ్యంలో చందూర్ మండల కేంద్రంలో ఓ వ్యక్తి వద్ద ఉపాధి పొందుతూ మద్యం సేవించగా జీవితంపై విరక్తితో తాను ఉండే గదిలో తాడుతో ఉరేసుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు.

బీబీపేట జ్యోతిబా పూలే పాఠశాల, హాస్టల్ బిల్డింగ్‌ను మార్చాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బీబీపేట మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల,హాస్టల్ ప్రైవేట్ బిల్డింగ్‌ను మార్చాలని విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. పలువురు పేరెంట్స్ కలెక్టరేట్‌లోకి వెళ్లెందుకు ప్రయత్నించగా ఎక్కువమంది లోపలికి వెళ్లవద్దని కొంతమందిని మాత్రమే పంపిస్తామంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీబీపేట జ్యోతిబాపూలే బాలుర హాస్టల్ ప్రైవేట్ బిల్డింగ్‌లో కొనసాగుతుందని ఈ బిల్డింగ్‌లో 250 నుండి 300 మంది సామర్థ్యం మాత్రమే ఉన్నారని ప్రస్తుతం బిల్డింగ్‌లో 430 మంది విద్యార్థులు ఉండి చదువుతున్నారని తెలిపారు. పిల్లలకు సరిపడే బాత్రూంలు లేవని, స్నానాల గదులు లేవని, డార్మెంటరి లేదని, చదువుకునే క్లాసులోనే పండుకోవాలని తెలిపారు. మా పిల్లల లగేజ్ కూడా క్లాసరూమ్‌లోనే పెట్టుకోవాల్సి వస్తుందని, వర్షం పడితే కిటికిలు మూస్తే తలుపులు లేవు కింద అయిన పడుకుందామంటే మా పిల్లలు చదువుకునే రూముల్లో ఫ్లోరింగ్ లేక గుంతలలో పడుకుంటున్నారని తెలిపారు. పిల్లలను చూసేందుకు వెళ్తె ఎడుస్తు వారి బాధలను చెప్పుకుంటున్నారని అన్నారు. పిండుకన్ను బట్టలు ఆరేయడానికి కూడా స్థలం లేని పరిస్థితి, పచ్చి బట్టలు వేసుకుంటే దురద, తామర, గజ్జి లాంటి అంటువ్యాధులు సోకి అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. సరిగ్గా నిద్రలేక పిల్లలు మానసికంగా, శారీరకంగా ఎదగలేకపోతున్నారన్నారు. డ్రిల్ పీరియడ్‌లో ఆటలు ఆడుకుందామంటే ఆట స్థలం లేని పరిస్థితి, మా పిల్లలకు ప్రతిరెండో ఆదివారం ఇంటి నుండి భోజనం తీసుకెళ్లి తినిపించి కాసేపు మాట్లాడుకుందామనుకుంటే సరైన గ్రౌండ్ లేకపోవడంతో బొందల గడ్డల పక్కన కూర్చుని చెట్లకింద భోజనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరుతున్నామన్నారు.


బాచన్‌పల్లి గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

విప్లవ సాహిత్య పరిశోధకుడు.. ప్రొఫెసర్ డాక్టర్ ముత్యం

● ఎమ్మెల్సీ జేఏసీ చైర్మన్ కోదండరాం

భీమ్‌గల్‌రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విప్లవ సాహిత్య పరిశోధకుడు, శాస్త్రీయ చైతన్య స్ఫూర్తికుడు, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన గొప్ప మేధావి ప్రొఫెసర్ డాక్టర్ ముత్యం అని తెలంగాణ జేఏసీ చైర్మన్ ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. మండలంలోని బాచన్‌పల్లి గ్రామంలో సోమవారం డాక్టర్ ముత్యం సంస్మరణ సభకు కోదండరాం ముఖ్యఅతిథిగా హాజరై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో పుట్టి ఎన్నో పరిశోధనలు చేసి బాచన్‌పల్లి గ్రామాన్ని చరిత్రలోనే నిలిచి పోయేలా చేశాడని ముత్యం చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లింబాద్రి, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ రామకృష్ణ, దేవరాం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆలూర్ విద్యార్థి..

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాషస్థాయి కబడ్డీ పోటీలకు ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్.శంకర్‌గౌడ్ ఎంపికైనట్లు హెచ్‌ఎం నరేందర్, పీడీ రాజేష్‌లు తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించి ఉమ్మడి జిల్లాల 17 ఏళ్ల లోపు కబడ్డీ ఎంపిక పోటీలలో శంకర్‌గౌడ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వచ్చేనెల 3వ తేదీ నుంచి మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియన్ బాలుర కబడ్డీ పోటీలలో ఈయన పాల్గొంటారన్నారు.

.. వాలీబాల్ పోటీలకు మగ్గిడి విద్యార్థుల ఎంపిక

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం హరిత, వ్యాయమ ఉపాధ్యాయుడు మధు తెలిపారు. అండర్ -17 విభాగంలో హిమతేజ, శ్రీనిధి, స్పందన, బాలుర విభాగంలో జశ్వంత్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి పెద్దపల్లి జిల్లా గోదావరి ఖనీలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు

రాష్ట్రస్థాయి పోటీలకు బాలికల హైస్కూల్ విద్యార్థినులు

భీమ్‌గల్ అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని బోయిగల్లీలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వాణి, శరణ్యలు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్‌ఎం, మండల విద్యాధికారి స్వామి ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఇటీవల సిర్పాపల్లిలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చగా వాణికి జట్టులోకి శరణ్యను స్టాండ్‌బైగా రాష్ట్రస్థాయి జట్టులోకి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింబాద్రి, వాసుదేవ్, రఘువాసు, పెద్ది మురళీ, రాములు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

..సాఫ్ట్‌బాల్‌లో తొర్లికొండ విద్యార్థులకు బంగారు పతకాలు

జక్రాన్‌పల్లి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్‌జూనియన్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలో తొర్లికొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలో పాల్గొని తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్ తెలిపారు. వరంగల్‌లో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో తొర్లికొండ పాఠశాలకు చెందిన విద్యార్థులు వనజ, సరితలు జిల్లా జట్టులో పా ల్గొని ప్రథమ స్థానంలో గెలుపొందినకు కృషి చేసి బంగారు పథకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు వనజ సరితను ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, వీడీసీసభ్యులు ఘనంగా సన్మానించారు.

..కబడ్డీ పోటీలకు బషీరాబాద్ హైస్కూల్ విద్యార్థి ఎంపిక

కమ్మర్‌పల్లి, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) మండలంలోని బషీరాబాద్ జిల్లా ఉన్నత పాఠశాల పదో తరగతికి చెందిన విద్యార్థి ఎండి ఆదిల్ అండర్ 17 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకుఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనక గంగాధర్ తెలిపారు. ఆదివారం కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల క్రీడాకారుల ఎంపికలో అత్యుత్త క్రీడాప్రతిభను కనబర్చినందుకు విద్యార్థి ఆదిల్‌ను రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. నవంబర్ నెలలో 3, 4, 5, తేదీలలో మహబూబ్‌నగర్‌లో నిర్వహింపబడే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుతరపున పాల్గొన్నున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి ఆదిల్ అభినందిస్తు ఘనంగ సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంగాధర్, అమ్మఆదర్శపాఠశాల కమిటి చైర్మన్ స్వప్న, వీడీసీ అధ్యక్షుడు ఆనంద్, వ్యాయమ ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, ఉపా ధ్యాయులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

జక్రాన్‌పల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అనంతరం పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు సుశీల్‌కుమార్, వెంకట్‌కుమార్, మండల కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, మాజీవైస్‌ఎంపీపీ జితేందర్‌నాయక్, మాజీసర్పంచ్ కాట్‌పల్లి నర్సారెడ్డి పాల్గొన్నారు.

ఎడపల్లిలో..

ఎడపల్లి: విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసు అమర వీరులకు సోమవారం ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బోధన్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీస్ అమర వీరుల త్యాగాలను ఆయన కొనియాడారు. పోలీసులు తమ విధుల పట్ల నిబద్ధతతో ముందుకు సాగుతారన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి ఉన్నారు.

ఎడపల్లి బంద్ ప్రశాంతం.

ఎడపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయం విధ్వంసం, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న హిందువులపై పోలీసులు జరిపిన లాఠీచార్జికి నిరసనగా ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలో మండల బీజేపీ శాఖ, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎడపల్లి బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎడపల్లి మండల బీజేపి శాఖ, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఎడపల్లి గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించి, సంఘ విద్రోహ శక్తుల దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు కందగట్ల రాంచందర్ మాట్లాడుతూ ముత్యాలమ్మ ఆలయం విధ్వసం చేసిన వారిని కఠినంగా శిక్షించి ఈ దురాగతానికి పాల్పడ్డ వారికి జీవిత ఖైదు విధించాలని వారు డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాలపై దాడులు, హిందూ విగ్రహాలు ధ్వంసం చేస్తే చూస్తూ ఊరుకోబోమని తిరుగుబాటు ఎడపల్లి నుండే ప్రారంభం అవుతుందన్నారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులపై మౌనం వీడాలని దాడులు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లెపూల శ్రీనివాస్, నాయిని లక్ష్మణ్‌గౌడ్, శివ చైతన్య, నవీన్, కట్కం సుధాకర్, ద్యాకరం సాయరెడి, కంజ ర్ ప్రదీప్ కుమార్, అనిరుధ్ గౌడ్ తదితరులు ఉన్నారు.



మద్నూర్ ఉన్నత పాఠశాలలో దాత ఏర్పాటు చేసిన శుద్ధి నీటి కుళాయిలు

దాతల సహకారం.. సమస్యలు దూరం!

• మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందుకొస్తున్న దాతలు

మద్నూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివేది పేదపిల్లలే. మౌలిక సదుపాయాలు, విద్యా సామగ్రి తగినంతగా ఉంటేనే చదువుపై దృష్టి పెట్టి రాణించే వీలుంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడానికి గతంలో దాతలు ముందుకు రాగా అనేక పాఠశాలల్లో సమస్యలు దూరమయ్యాయి. ప్రస్తుతం విద్యా సంవత్సరంలోనూ దాతల సహకారం అవసరమని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు కోరుకుంటున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇటీవల గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తన తాత గారి పేరిట నీటిశుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ నీటిశుద్ధి యంత్రం విద్యార్థులకు తాగునీటి సమస్య తీర్చినట్లు అయింది. అదే విధంగా గతంలో పాఠశాల గేట్లను మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంగమేశ్వర్ అంద జేయగా, పాఠశాలకు కావాల్సిన డీజేను మండల కేంద్రానికి చెందిన మచ్చకూరి సంతోష్ సమకూర్చారు. అదే విధంగా ఉపాధ్యాయులు సీతయ్య విద్యా ర్థులు కూర్చోవడానికి గాను బెంచీలను అందజేశారు.

• తాగునీటి సమస్య గుర్తించి..

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తీవ్ర తాగునీటి సమస్యను గుర్తించిన గ్రామ వ్యాపారవేత్త పాఠశాల ఆవరణలో నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలను గుర్తించి వాటికి సంబంధించిన సౌకర్యాలను కల్పించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నేడు దుర్కి బంద్‌కు పిలుపు

నసురుల్లాబాద్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలో మంగళవారం బంద్‌కు హిందూ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందం గా బంద్‌కు సహకరించాలని కోరారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఈ బంద్‌ను నిర్వహిస్తున్నామని హిందూ సంఘాల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్



• నాగిరెడ్డిపేట మండలంలోని విత్తన క్షేత్రం కార్యాలయ భవనం

ప్రభుత్వ విత్తన క్షేత్రంలో.. ఖరీఫ్ సాగు శూన్యం!

• అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసినా నిరుపయోగం • సాగు లేక బీడుగా మారిన విత్తన క్షేత్రం భూములు

నాగిరెడ్డిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ విత్తన క్షేత్రం ప్రస్తుతం ఖరీఫ్‌లో పంటల సాగుకు నోచుకోక వెలవెలబోతోంది. ఈ ప్రభుత్వ విత్తనక్షేత్రం పరిధిలో వందల ఎకరాల భూములుండి, ముఖ్యంగా వరి సాగుకు యోగ్యంగా వంద ఎకరాలకు పైగా సాగు భూములు ఉన్నా క్షేత్రం అధికారులు, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఒక్క గుంట భూమైనా సాగుకు నోచుకోలేదు.

• నిర్లక్ష్యపు నీడలో విత్తన క్షేత్రం

గతంలో ఉమ్మడి రాష్ట్రంలోనే మేలు రకాల వంగడాలను ఉత్పత్తి చేయడంలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ విత్తన క్షేత్రం నేడు విత్తనోత్పత్తిలో పూర్తి గా దూరమైంది. క్షేత్రంలో ఏటూచూసినా వందల ఎకరాల భూములు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. ఒకవైపు మండలంలోని రైతులు ప్రస్తుత ఖరీఫ్‌లో వేల ఎకరాలలో వరిపంటలు సాగు చేస్తుండగా, తెలంగాణ రాష్ట్ర ంలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ విత్తనక్షేత్రంలో ప్రస్తుత ఖరీఫ్‌లో క్షేత్రం అధికారులు ఒక్క గుంట భూమి సాగు చేయలేదంటే క్షేత్రం అధికారుల నిర్లక్ష్యం దీనికి అద్దం పడుతోంది.

• క్షేత్రంలో 701 ఎకరాల భూమి

క్షేత్రం పరిధిలో 701 ఎకరాల భూములుండగా అందులో వరి సాగుకు యోగ్యంగా వంద ఎకరాలకుపైగా భూములున్నాయి. ఇతర పంటల సాగు కు మరో 300 ఎకరాల వరకు భూములున్నాయి. గతంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు వంద ఎకరాలకుపైగా వరి పంటలు సాగు చేసేవారు. ఈసారి ఆలస్యంగా వర్షాలు కురవడంతో విత్తన క్షేత్రంలో 50 ఎకరాలలో విత్తనోత్పత్తి జరిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు అప్పటి ఏడీఏ వీరస్వామి తెలి పారు. అయినా విత్తన క్షేత్రంలో ఎలాంటి విత్తన ఉత్పత్తి జరగలేదు. ఏడీఏ వీరస్వామి ఇటీవలే ఇక్కడి నుంచి బదిలీ అయివెళ్లారు. ఆయన స్థానంలో విత్తన క్షేత్రంలో ఏవోగా పనిచేస్తున్న హరివెంకట ప్రసాద్‌కు ఇన్‌చార్జి ఏడీ ఏగా బాధ్యతలు అప్పగించారు. ఈ విత్తన క్షేత్రంలో పంటల సాగు కోసం పోచారం ప్రధాన కాలువ ద్వారా ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని అందిస్తారు. క్షేత్రంలో పంటల సాగు కోసం పది వరకు బోర్లు ఉన్నాయి. గత నాలుగు సంవత్సరాల క్రితం వరకు ప్రతీ ఖరీఫ్ సీజన్‌లోనూ వంద ఎకరాలకుపైగా వరిని సాగుచేసేవారు. రానురాను క్షేత్రంలో సాగు విస్తీర్ణం తగ్గుతూ పోగా, ప్రస్తుతం ఖరీఫ్‌లో వరి సాగు పూర్తిగా శూన్యమైంది.

• సకాలంలో పోచారం ప్రాజెక్టు నిండకపోవడమే కారణమా?

ప్రస్తుత ఖరీఫ్‌లో విత్తన క్షేత్రం పంటల సాగుకు నోచుకోకపోవడానికి ప్రధాన కారణం సకాలంలో వర్షాలు కురవకపోవడం, సకాలంలో పోచారం ప్రాజెక్టు నిండకపోవడమే కారణమని విత్తనక్షేత్రం అధికారులు అంటున్నా రు. ఆగస్టు మాసం వరకు పోచారం ప్రాజెక్టు 16 అడుగుల నీటి మట్టానికి చేరుకోగా, ఆగస్టు 15న ఆయకట్టు భూముల పంటల సాగు కోసం పోచారం ప్రాజెక్టు నీటిని అధికారులు విడుదల చేశారు. అప్పటికే ఆయకట్టు రైతులం దరూ బోరుబావుల సహాయంతో వరి నాట్లు వేయడం పూర్తిచేశారు. కానీ ఈ విత్తన క్షేత్రం అధికారులు మాత్రం వరి నారు నాళ్లు సైతం వేయకుండా, వర్షాలు కురుస్తాయో లేదోనని, పోచారం ప్రాజెక్టు నిండుతుందో లేదోనన్న అనుమానంతో క్షేత్రంలో ఈసారి సాగు జోలికే వెళ్లలేదు. ఆగస్టు చివరివారంలో కురిసిన భారీ వర్షాల కారణంగా సెప్టెంబరు 1 నాటికి పోచారం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి పొంగిపొర్లింది. ప్రస్తుతం పోచారం ప్రాజెక్టు 17 వేల ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీరు అందిస్తుండగా, పోచారం ప్రధాన కాలువ ద్వారా ఎత్తిపోతల సౌకర్యం ఉన్న ఈవిత్తన క్షేత్రం మాత్రం సాగుకు నోచుకోకపోవడం ఎంతో బాధాకరం. ఇప్పటికైనా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్, ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టి రానున్న రబీ సీజన్‌లోనైనా ఈ విత్తన క్షేత్రంలో పంటల సాగు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సకాలంలో వర్షాలు కురవక.. ఉన్నతాధికారుల ఆదేశాల్లేక..

• హరి వెంకట ప్రసాద్, ఇన్‌చార్జి ఏడీఏ, విత్తన క్షేత్రం మాల్తుమ్మెద

మాల్తుమ్మెద విత్తనక్షేత్రంలో పంటల సాగు కోసం పోచారం ప్రాజెక్టు ప్రధాన ఆధారం. ప్రస్తుత వర్షాకాలంలో వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో సకాలంలో పోచారం ప్రాజెక్టు నిండలేదు. క్షేత్రంలో 50 ఎకరాలలో విత్తనోత్పత్తి జరిపేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవు. దీంతో విత్తన క్షేత్రంలో ఈ ఖరీఫ్‌లో సాగు చేపట్టలేదు. రబీలో మాత్రం సాగు చేయనున్నాం.



విత్తన క్షేత్రం భూముల్లో పశువులు మేపుతున్న పశువుల కాపరులు

కామారెడ్డి జిల్లా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఓటరు జాబితా సవరణ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి

• రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోఓటరు జాబితా సవరణ 2024-25 సంబంధించి ప్రణాళిక బద్ధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్రముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్సీ ఓటరు రూపకల్పనపై మాట్లాడారు. ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు వస్తున్న దరఖాస్తుల విచారణ మిషన్‌మోడ్‌లో పూర్తిచేయాలని అన్నారు. ఉమ్మడి మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్- కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల స్థానానికి లక్ష దరఖాస్తులు, టీచర్ల స్థానానికి 2046 దరఖాస్తులు రాగా 7వేల పట్టభద్రుల దరఖాస్తులు మాత్రమే విచారణ పూర్తి అయ్యాయని తెలిపారు. పెండింగ్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు నమోదు దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని కలెక్టర్‌లను ఆదేశించారు. అర్హులైన ఓటర్‌ల పేర్లు నవంబర్ 6 లోపు నమోదుచేయాలని సూచించారు. ఓటర్ జాబితా సవరణ స్వీప్ కార్యక్రమాలు పక్కగా చేపట్టాలని, దీనికోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని తెలిపారు. అక్టోబరు 29 నడ్రాఫ్ట్ ఓట ర్ జాబితా విడుదల చేయడం జరుగుతుందని, నూతన ఓటర్ నమోదు దరఖాస్తులను నవంబర్ 29 వరకు స్వీకరిస్తామని, డిసెంబర్ 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6 న తుది ఓటర్ జాబితా ప్రచురించాలని తెలిపారు.అనంతరం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతీ ఒక్కరి పేరును ఓటరుజాబితాలో ఎన్‌రోల్‌మెంట్‌లను వేగవంతంచేయాలని అన్నారు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎన్‌రోల్‌మెంట్ కూడా వేగవంతం చేయాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రంగనాథ్‌రావు, డీఆర్‌డీఓ పీడీఅధికారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు తీర్చేందుకు కంట్రోల్‌రూం ఏర్పాటు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు తీర్చేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం 08468-220051కు ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పౌరసరాఫరాల మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంను ఆయన ప్రారంభించారు. జిల్లాలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలవద్ద సమస్యలు వచ్చినప్పుడు ఫిర్యాదు చేయవచ్చని కంట్రోల్ రూంలో అందిన ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పౌరసరాఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజేందర్, సహాయ పౌరసరాఫరాల అధికారి నరసింహరావు, జిల్లా సహకార అధికారి రాంమోహన్, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రామారెడ్డి - రెడ్డిపేట్ మధ్య నిలిచిన బీటీ రోడ్డు

• రోడ్డుపై భారీ గుంతలు • పట్టించుకోని అధికారులు

జర దేఖో!!



రామారెడ్డి నుంచి భీమ్‌గల్ వెళ్లే రోడ్డు ఇలా..

రామారెడ్డి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల కేంద్రం నుంచి భీంగల్, నిజామాబాద్ వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. రోడ్లపై బీటీ రోడ్లపై గుంతలు పడటంతో వర్షాకాలం వాహనాలు నడిపేవారు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోలు ప్రైవేట్‌బస్సులు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నా వర్షాకాలంతో వాహనాలు నడిపేటప్పుడు ఇంకుడు గుంతల్లో నీరు ఉండటంతో అతివేగంగా వెళుతున్న వాహనాలు ఢీకొట్టడంతో ద్విచక్రవాహనాలపై ఉంటున్న వెళ్తున్న వాహనదారులపై పడుతున్నాయి. దీంతో రోడ్లపై వ్యవసాయ పనుల కోసం వెళుతున్న మహిళలపై మురికి నీరు చిత్తడితో చాలా ఇబ్బందులు అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. కాగా రామారెడ్డి మండల కేంద్రం నుంచి మాచారెడ్డి చౌరస్తా వరకు డబుల్ బీటీ రోడ్డు వేయించారు. రామారెడ్డి గ్రామ చివరి నుంచి కన్నాపూర్ గ్రామ చివరి వరకు డబుల్ రోడ్డు వేయించడం మానేయడంతో 3 కిలోమీటర్ల పాటు రోడ్డు అధ్వానంగా ఉండటంతో తీవ్ర ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. డబుల్ రోడ్డు నిర్మించారు. కానీ 3 కిలోమీటర్ల పాటు సింగిల్ బీటీ రోడ్డు ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రోడ్లపై మురికి ఉండటం, అధ్వాన్న స్థితిలోకి రోడ్లు చెడిపోతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనాలు కిందికి దింపి వాహనాలు నడిపించడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలు కురవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు ప్రత్యేక అధికారులు నియమించారు. ఇకనైనా పట్టించుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



బీరువాలో ఉంచిన పరికరాలు

ప్రయోగశాల లేక.. మూలుగుతున్న పరికరాలు

బీర్కూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక చొరవ తీసుకుని బీర్కూర్ మండల కేంద్రానికి 2021లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయించారు. పక్కా భవనాలు లేక కళాశాలను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేశారు. కళాశాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా గదులను కేటాయించారు. అప్పటినుంచి కళాశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతుంది. ఇదిలా ఉండగా.. 2023 మే నెలలో కళాశాల వివిధ సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థుల కోసం 5లక్షల విలువైన ప్రయోగశాల పరికరాలు మంజూరయ్యాయి. అయితే కళాశాలలో గదుల కొరత కారణంగా ప్రయోగశాల ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో విద్యార్థులు ప్రాక్టికల్స్ చేసే అవకాశాన్ని కోల్పోతున్నారు. 2022, 2023 విద్యా సంవత్సరంలో కళాశాలలో ప్రయోగశాల లేదు. దీంతో విద్యార్థులు రెండేళ్లపాటు బాన్సువాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి ప్రయోగ పరీక్షలకు హాజరయ్యారు. ఉన్నత పాఠశాలలో కేటాయించిన ఆరు గదుల్లో 5గదుల్లో విద్యార్థుల కోసం కేటాయించారు. మిగిలిన ఒక గదిలో ప్రిన్సిపాల్, స్టాఫ్, గ్రంథాలయం, ప్రయోగశాల పరికరాలు ఉంచేందుకు వాడుతున్నారు. విద్యార్థులకు ప్రయోగాలు చేసి చూపడానికి పరికరాలను తరగతి గదులను తీసుకువచ్చి ప్రయోగాలు చేయిస్తున్నారు. అనంతరం పరికరాలను ప్రిన్సిపాల్ రూమ్‌కు తరలించి బీరువాల్లో భద్రపరుస్తున్నారు. ప్రయోగాలు చేసి చూపించాల్సిన ప్రతిసారి పరికరాలు తరగతి గదులకు తీసుకురావడం, ప్రిన్సిపాల్ రూమ్‌కు తీసుకువెళ్లడం ఇబ్బందికరంగా మారుతోంది. ప్రయోగశాలకు ప్రత్యేక గది లేక పరికరాలు అలంకార ప్రాయంగా మారాయి. ప్రయోగశాలకు ప్రత్యేక గది కేటాయించాలని విద్యార్థులు కోరుతున్నారు. పాలకులు చొరవ తీసుకుని జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించాలని, పక్కా భవనాలు నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్‌లో ధరల మంట!

కూరగాయాలే!



• భగ్గుమంటున్న కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు • అధిక ధరలతో కొనుగోలుదారుడి జేబులకు చిల్లు

• పండగల పూట జిల్లాలో దడ పుట్టిస్తున్న ధరలు



కమ్మర్‌పల్లిలో కూరగాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

కమ్మర్‌పల్లి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): అటు కూరగాయలు, ఇటు వంట నూనెలు, నిత్యావసర సరుకుల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు ఎగబాకుతున్నాయి. పండగల పూట కొనుగోలుదారుడికి ధరాఘాతం మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు, వంటనూనెలు కొనుగోలు చేస్తే జేబులకు చిల్లులు పడుతున్నాయి తప్ప వెంటతీసుకెళ్లిన చేతి సంచి నిండక వెక్కిరిస్తోంది. వర్షాలు అధికంగా కురిసి కూరగాయలు తక్కువ ధరకు వస్తాయని ఎదురుచూసిన కొనుగోలుదారుడి ఆశలపై ప్రస్తుతం కూరగాయల ధరలు నీళ్లు చల్లి నీరసించి పోయేలా పైపైకి ఎగబాకుతున్నాయి. ఈ ఏడాది తీవ్రమైన ఎండలు, అధిక వర్షాలు కూరగాయల సాగును పూర్తిస్థాయిలో నాశనం చేయగా.. కూరగాయలు పండినా నాణ్యత లేక పశువుల మేతకు వదిలేశారు. వర్షాలు, వరదలు తగ్గిన సమయంలో పంటలు కోల్పోవడంతో కూరగాయల ధరలు ఆకాశంపైకి ఎగబాకి సామాన్యుడికి అందనంతగా మారాయి. కూరగాయలు, ఆకుకూరలు, అల్లం, పచ్చిమిచ్చి వేటిని కొనే పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి ప్రజలులేరు. మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. మార్కెట్లో టమాట ధర అయితే నిన్నామొన్నటివరకు రూ.30 పలుకగా ప్రస్తుతం 50కి చేరువయ్యాయి. ఇంకా పెరిగే అవకాశమూ లేకపోలేదు. అదేవిధంగా పచ్చి మిర్చి ఘాటెక్కిస్తుందనే చెప్పాలి. ఆకుకూరల ధరలు సైతం కిలోకు రూ.80కి తగ్గడం లేదు. చిక్కుడు కాయ, బీరకాయ, బెండకాయ, కొత్తిమీర.. ఇలా ఏదికొనాలన్నా ధరలు మండిపోతున్నాయి. అలాగే ఉల్లి, అల్లం, వెల్లుల్లి ధరలు ఘాటెక్కాయి. ఏది కొనాలన్న రూ. 80పై మాటే. ఈ ప్రాంతంలో పంటలు సరిగా సాగుకాకపోవడంతో పక్క రాష్ట్రాలు, జిల్లాల నుంచి దిగుమతి అవుతున్నాయి. దీంతో ధరలు మరింతగా మండిపోతున్నాయి. ఇదిలా ఉంటే.. ఆకుకూరలైన పాలకూర, గొంగూర, తోటకూరలు మార్కెట్‌లో కనిపించడం లేదు. ఇకవంతు వంతు వంటనూనెలది. నిన్న మొన్నటివలకు లీటర్ నూనె 85 నుంచి వంద వరకు పలికిన ధరలు ఇప్పుడు ఏరకం నూనె కిలో ప్యాకెట్ పల్లి నూనె, మొదలు పామాయిల్ తదతర నూనెలు లీటర ప్యాకెట్ రూ.110కి ఉండగా ప్రస్తుతం ఏరకం కొన్నా 150కి పెరిగింది. 5 కిలోల నూనె క్యాన్ 700లకు చేరింది. కందిపుప్ప కిలో 180 నుంచి 200 పెరిగింది. ఈ క్రమంలో ప్రభుత్వమే ధరలను నియంత్రించాల్సిన అవసరం ఉంది.

జాప్యానికి తావులేకుండా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ మంజూరు

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జాప్యానికి తావులేకుండా అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంజూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీలు మహేష్‌కుమార్‌గౌడ్, జీవన్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 513 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్షా 116 చొప్పున మొత్తం 5కోట్ల 13లక్షల పైచిలుకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు బాసటగా నిలువాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద ఆడపిల్లల పెళ్లి కోసం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. వీటి మంజూరులో ఎలాంటి కాలయాపన జరగకుండా లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నెలరోజుల వ్యవధిలోనే చెక్కులు అందేలా చూడాలన్నారు. ఒకవేళ దరఖాస్తులు తిరస్కరిస్తే అందుకుగల కారణాలను తెలియజేయాలన్నారు. గత ప్రభుత్వ వైఫల్యం కారణంగా ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ 8లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ప్రతీనెల వడ్డీ 6వేల కోట్లు ప్రభుత్వం చెల్లిస్తుందని అయినప్పటికీ ఆర్థిక భారాన్ని భరిస్తూ ప్రభుత్వం విద్య, వైద్య, సంక్షేమ అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వేదికగా ఉన్న రాజీవ్‌గాంధీ ఆడిటోరియం ఆధునీకరణకు రూ.50లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార సంఘాల చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, వివిధ డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

కోర్టులలో మౌలిక సదుపాయాలు తప్పనిసరి

నిజామాబాద్ లీగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాలల్లో విధులు నిర్వహిస్తున్న న్యాయాధికారులకు, న్యాయస్థానాలకు మౌలిక వసతుల కల్పన ముఖ్యమని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు సురేందర్, లక్ష్మినారాయణ అలిశెట్టి, వినోద్ కుమార్‌లు తెలిపారు. నిజామాబాద్, బోధన్ కోర్టు ప్రాంగణాలల్లో న్యాయాధికారుల కోసం నూతనంగా నిర్మించనున్న గృహ వసతులకు వారు వర్చువల్ విధానంలో శంకుస్థాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలుత నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల స్వాగతోపన్యాసం చేసిన అనంతరం హైకోర్టు న్యాయమూర్తులు న్యాయవాదులు, న్యాయ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి జస్టిస్ కాసోజు సురేందర్ మాట్లాడుతూ.. నిజామాబాద్, బోధన్ కోర్టుల ప్రాంగణాలల్లో న్యాయాధికారులకు అదే ప్రాంగణాలల్లో అందుబాటులో ఉండే విధంగా గృహ సముదాయాలకు శంకుస్థాపనకు శ్రీకారం చుట్టడం మౌలిక వసతుల కల్పనలో ఒకమెట్టుగా ఆయన అభివర్ణించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో లిఫ్టను పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీ నారాయణ అలిశెట్టి మాట్లాడుతూ.. కోర్టు సముదాయాలల్లోనే న్యాయాధికారులకు క్వార్టర్స్ ఉండడం మూలంగా త్వరితగతిన వారు కోర్టు విధులకు చేరుకోగలరని అన్నారు. కోర్టు సముదాయాలల్లో న్యాయాధికారులకు గృహవసతి కల్పించడం వలన భద్రతపరమైన సమస్యలు ఉండవని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్ కుమార్ అన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా శిథిలా వస్థకు చేరిన ఓల్డ్ క్వార్టర్స్ స్థానంలో నూతనమైన క్వార్టర్ నిర్మించుకో బోవడం శుభసూచకమని అన్నారు. లిఫ్టలను మంజూరు చేసిన హైకోర్టు న్యాయమూర్తులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ.. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న న్యాయాధికారులకు సౌలభ్యకరంగా ఉండే విధంగా న్యాయాధికాల నూతన భవన నిర్మాణాలు ఉంటాయని ఆశించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు కనక దుర్గ, శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు కుష్బూ, గోపికృష్ణ, చైతన్య, బార్ ప్రధా కార్యదర్శి వసంత్ రావు, ఉపాధ్యాక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో ఐదుగురి అరెస్టు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ బస్టాండ్ నుంచి ఆటోలో మహిళను తీసుకొని జిల్లాలోని డిచ్‌పల్లి ప్రాంతంలో అత్యాచారం చేసిన ఘటనలో పోలీసులు సోమవారం ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈనెల 18న అర్ధరాత్రి మహిళను డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లికి చెందిన జైనొద్దీన్ ఖురీషి, ఘన్పూర్‌కు చెందిన మోహసీన్ ఖురీషి, మిట్టపల్లికి చెందిన మహ్మద్ సుల్తాన్, నాగ్‌పూర్ గేట్ ప్రాంతానికి చెందిన నగేష్ చిలంకర్, డిచ్‌పల్లి మండలం నడిపల్లికి చెందిన షేక్ రఫీక్‌లు తనపై అత్యాచారం చేసినట్లు బాధితురాలు తమకు ఫిర్యాదు చేసిందని ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఈ మేరకు ఐదుగురిపై అత్యాచారం, ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి బైక్, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మంత్రి జూపల్లికి స్వాగతం పలికిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం నగరానికి విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, నగర కమీషనర్ మకరంద్‌లు నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద స్వాగతం పలికారు. అనంతరం మంత్రితో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌లతో కలెక్టర్, కమీషనర్‌లు బేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. అంతకుముందు మంత్రి జూపల్లి పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. మంత్రి వెంట ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డిరాజరెడ్డిలు ఉన్నారు.

బెటాలియన్‌లో పోలీసు అమరవీరులకు ఘన నివాళి

డిచ్‌పల్లి, అక్టోబర్ 21: పోలీసు అమర వీరుల దినోత్సవం పురష్కరించుకొని సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్‌లో ఇన్‌చార్జి కమాండెంట్ సురేశ్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కమాండెంట్ మాట్లాడుతూ.. యావత్ భారత్ అక్టోబరు 21న సంస్మరన దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీసులు విధులు నిర్వర్తిసారన్నారు. ఉగ్రవాద, తీవ్రవాద చర్యలను ఎదుర్కొంటూ సంఘ విద్రోహ శక్తుల నుంచి పౌరుల మాన, రక్షణ, ధన పోరాటం చేస్తూ అమరుల త్యాగానికి చిహ్నంగా అక్టోబరు 21న అమర వీరుల దినంగా పాటిస్తామన్నారు. 2023 సెప్టెంబరు 1 నుంచి 31ఆగస్టు 2024 వరకు భారతదేశం అంతటా విధి నిర్వహణలో 214మంది పోలీసులు అమరులయ్యారని అన్నారు. 7వ బెటాలియన్ 11మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారన్నారు. అమరుల కుటుంబాలకు కమాండెంట్ సానుభూతి తెలిపారు. అమర కుటుంబాలకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు సత్యనారాయణ, శరత్, అనుపమ, అయ్యవరయ్య, రాజు. శ్యాంరావు, వసంత్ రావు, ఆర్ఎస్సైలు పోలీసుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పోలీసు అమర వీరుల స్తూపం వద్ద నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

పట్టభద్రుల ఎమ్మెల్సీని తిరిగి కైవసం చేసుకోవాలి

● టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని తిరిగి కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని బస్వాగార్డెన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గతంలో అధికారంలో లేనప్పుడే నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానాన్ని గెలుచుకున్నామని ప్రస్తుతం అధికారంలో ఉండగా తప్పనిసరిగా మళ్లీ ఆ స్థానాన్ని కైవసం చేసుకోవాలన్నారు. పట్టభద్రుల ఎన్‌రోల్‌మెంట్‌లో ఎన్ఎస్‌యుఐ, యువజన కాంగ్రెస్ నాయకులు విశేష కృషి చేయాలని ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్తను ఎన్‌రోల్‌మెంట్ చేయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఉద్యోగాల పేరుతో మోసం చేస్తుందని అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని బీజేపి, బీఆర్ఎస్ పార్టీల మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని తప్పనిసరిగా గెలుపొందేలా పట్టభద్రుల నమోదు పక్కాగా చేయాలన్నారు. వచ్చేనెల 6వరకే నమోదుకు అవకాశం ఉందని కావున ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తమ ఇంట్లోని పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నియోజకవర్గ ఇంచార్జిలు వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు రామర్తిగోపి, విక్కియాదవ్, తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌రోల్‌మెంట్‌ను ప్రారంభిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్, తదితరులు

రాష్ట్ర వ్యవసాయ సహకార కమిషన్ సభ్యుడిగా గంగాధర్



నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌ను రాష్ట్ర వ్యవసాయ, సహకార కమిషన్ సభ్యుడిగా నియమిస్తూ వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. కమిషన్ చైర్మన్‌గా ఇదివరకే కోదండరెడ్డి నియామకమై బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా కమిటీలో ఏడుగురు సభ్యులను నియమించగా జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు గడుగు గంగాధర్‌ను సభ్యుడిగా నియమించారు. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ రేసులో ఉన్న గడుగు గంగాధర్‌ను వ్యవసాయ శాఖ కమీషన్ సభ్యుడిగా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారా లేరా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీనియర్ నాయకుడిగా ఉన్న ఆయనకు మొదటి విడతలోనే రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి రావాల్సి ఉండగా రాలేదు. రెండవ విడత రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవులను త్వరలో భర్తీ చేయనున్న నేపథ్యంలో కార్పొరేషన్ చైర్మన్ పదవి వస్తుందన్న ఆశలో ఉన్న ఆయనకు కమీషన్ సభ్యుడిగా నియమించడంతో ఆయన కమీషన్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరిస్తారో లేరో నన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రైతులకు అండగా కాంగ్రెస్: ఎమ్మెల్యే

మోపాల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సోమవారం రూరల్ మండలంలోని గుండారం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూడలేక బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన రెండులక్షల రుణమాఫీని ఇప్పటి వరకు 60 శాతం మంది రైతులకు చేయడం జరిగిందని మిగతా వారికి కూడా త్వరలోనే రుణమాఫీ జరగబోతుందన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో 8మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారని తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటవుతాయని వారి మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ శ్రీధర్, కాంగ్రెస్ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, సాయరెడ్డి, భోజన్న, నగేష్, పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, కొరవ గంగాధర్, భోజన్న, జనార్దన్, శ్రీనివాస్‌గౌడ్, ఆయా గ్రామాల రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గుండారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

'ప్రజావాణి'కి 82 వినతులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, తదితరులు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, డీఆర్‌డివో సాయాగౌడ్‌లకు విన్నవిస్తూ ఫిర్యాదులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడూ పరిశీలన జరుపుతూ సత్వరమే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదను కాపాడాలి..

జిల్లా వారసత్వ సంపదను ప్రభుత్వం కమిటీ వేసి పునరుద్ధరణ చేయాలని, పురాతన కట్టడాల పరిరక్షణకు కృషి చేయాలని అలగొండ జిల్లా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, నర్సింగ్‌రావులు కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. బాల్కొండ ఖిల్లాలో ఉపాధి హామీ పథకం కింద కూలీలతో పొదలు, ముళ్లకంపలు తీసివేయాలని కోరారు.

జిల్లా స్థాయిలో సత్తాచాటిన మోడల్ పాఠశాల విద్యార్థులు

ధర్పల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలో సత్తాచాటారు. ఖోఖోలో పాఠశాలకు చెందిన కళ్యాణి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. వాలీబాల్‌లో అండర్-18 విభాగంలో మీనాక్షి, గాయత్రీలు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అమ్తుల్‌బరీ, పీడీ కవిత, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు అన్ని విభాగాల్లో సత్తా చాటడంపై సంతోషం వ్యక్తం చేశారు.

కరేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నీలకంఠేశ్వర ఆలయంలో ఆశ్వీజమాస సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్వీజమాస పంచమి సందర్భంగా వేదపండితులు, అర్చకులు సుహాస్ శాఖాయ్, మకరంద్ శాఖాయ్ వేదమంత్రోచ్చరణలతో నీలకంఠునికి పంచామృత అభిషేకాలు జరిపారు. శివుని అష్టోత్తర శతనామాలతో బిల్వార్చన, పుష్పార్చన పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మహా అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రవీందర్, నీలేష్‌కులకర్ణి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

డిచ్‌పల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరట్‌పల్లి గ్రామంలో సోమవారం వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. సంస్థ ప్రతినిధి సుజాత మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

అండర్-19 ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

సుభాష్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల అండర్-19 బాలుర ఎంపికలు సోమవారం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాగారంలోని రాజారాం స్టేడియంలో ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్ నిర్వహించారు. ఈ ఎంపికల్లో ప్రతిభకనబర్చిన సుమారు 22 ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. ఈ ఎంపికైన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు పీడీ ప్రసాద్ తెలిపారు. ఈ ఎంపికల కార్యక్రమంలో పీఈటీలు అమీర్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం..

నగరంలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. గంటసేపు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కోర్టు చౌరస్తా, డ్వాక్రా బజార్‌రోడ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరద చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో మునిగిపోయాయి. - స్టాఫ్ ఫొటో గ్రాఫర్, నిజామాబాద్







అకాల వర్షానికి తడిసిన ధాన్యం

మోపాల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో తడిసిపోయిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షంతో మోపాల్ మండలంలోని న్యాల్‌కల్, సిర్పూర్, ముదక్‌పల్లి, మంచిప్ప, బాడ్సి, మోపాల్, తదితర గ్రామాల్లో రోడ్లపై పోసిన వరి ధాన్యం అంతా తడిసిపోయింది. అనుకోకుండా కురిసిన వర్షంతో ధాన్యం కుప్పలోకి వర్షం నీరు చేరడంతో రైతులు కన్నీరు మున్నీరు అయ్యారు. రైతులు కష్టపడి పనిచేస్తున్న ధాన్యం చేతికి వచ్చేసరికి అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుందని అన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే గ్రామాల్లో కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. తడిసిన ధాన్యా న్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.


తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.95	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.100	రూ.225	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.80800	రూ.74600	రూ.1000

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : వెట్టయన్ (10.10)
: ది వైల్డ్ రోబోట్ (ఇంగ్లీష్ 3డి) (1.40, 7.45, 10.15)
: దేవర (4.10)
స్క్రీన్-2 : ది వైల్డ్ రోబోట్ (ఇంగ్లీష్ 3డి) (10.30)
: విశ్వం (1.00, 7.15)
: జనక అయితే గనక (4.15, 10.30)
స్క్రీన్-3 : ఇద్దరు (10.00)
: లవ్‌రెడ్డి (1.00, 7.30)
: వెట్టయన్ (4.00) : ఖడ్గం (10.30)
స్క్రీన్-4 : రివైండ్ (10.25)
: వీక్షణం (1.20) : జిగ్రా (హిందీ) (4.00)
: విక్కి విద్య కా ఓ వాలా వీడియో (హిందీ) (7.20)
: వెట్టయన్ (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : విశ్వం (10.20, 1.20, 4.20, 10.30)
: దేవర (7.25)
స్క్రీన్-2 : జనక అయితే గనక (1.30, 7.35)
: మిస్టర్ పర్‌ఫెక్ట్ (4.30)
: జిగ్రా (హిందీ) (10.30)
స్క్రీన్-3 : వెట్టయన్ (10.30, 4.35, 7.40, 10.40)
: మిస్టర్ పర్‌ఫెక్ట్ (1.30)

దేవి : జనక అయితే గనక (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : విశ్వం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : వెట్టయన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్